సాక్షి పల్నాడు

ఆదివారం । 30 । జూన్ । 2024




రూ.లక్ష విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన భక్తుడు డాక్టర్ ఎల్.రాహుల్ రూ.1,00,116 విరాళం ఇచ్చారు.



ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో శనివారం దేవాలయాల అర్చకుల కమిటీ సభ్యుల సహకారంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లపై గుంటూరు కలెక్టర్ సమీక్ష



నగరంపాలెం: జూలై ఒకటో తేదీన తాడేపల్లి మండలం పెనుమాకలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరవుతారని, అధికారులు అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఏర్పాట్లపై శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌ఓ పెద్ది రోజా, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఉదయం ఆరు గంటలకు కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. అనంతరం జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో లబ్ధిదారులు, ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడతారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. పోలీస్ శాఖ బందోబస్త్ ఏర్పాట్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు బారికేడ్స్ ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, డీఎస్‌ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి



పెనమలూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన చేయాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల ఉపాధ్యాయులకు నిర్వహించిన అటల్ టింకరింగ్ శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన కల్పించుకుని విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. బోధనలో సాంకేతికత అంశాలను జోడించి విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, డీఎస్‌ఓ జాకీర్‌అహ్మద్, స్టేట్ హబ్ ఇన్‌చార్జి డి.వి.సుబ్బారావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ శిక్షణ శనివారంతో ముగిసింది.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 24 లోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే అదేరోజు తెనాలి, గుంటూరులలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లోని నమోదు కేంద్రాల్లో తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. జూలై 27, 28 తేదీలలో ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు 93477 95839, 63045 72793 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దుర్గమ్మకు కళాకారుల నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. వైష్ణవి నాట్యశాల ట్రస్ట్‌కు చెందిన పలువురు చిన్నారులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను కట్టి పడేసింది. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

అన్నదాతల అర్హతలపై ఆరా

- పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాపై విచారణ
- జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 1.90 లక్షలు
- జిల్లాలో 15,560 మంది వివరాల పరిశీలనకు చర్యలు

సత్తెనపల్లి: జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం లబ్ధిదారుల జాబితా పరిశీలన, అనర్హులను గుర్తించి తొలగింపు చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు లబ్ధిదారుల్లో 5 శాతం మంది వివరాలు ఆరా తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరిశీలించాల్సిన రైతుల పేర్లను సైతం పంపించింది. దీంతో వ్యవసాయ శాఖ సిబ్బంది 2022-23, 2023-24 సంవత్సరాల్లో పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా? లేదా?, అనర్హులు ఎవరైనా ఉన్నారా? లేదా? తదితర వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారుల ఇలా...

జిల్లాలో పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 1,90,008 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం రూ.38,00,16,000 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది. ఏడాదికి రూ.6 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.



గుడిపూడిలో పీఎం కిసాన్ లబ్ధిదారుడి పేస్ రికగ్నైజేషన్ తీస్తున్న వీఏఏ



యాప్‌లో పేర్కొన్న పరిశీలన అంశాలు

పరిశీలిస్తున్న అంశాలు

- ఆదాయపు పన్ను కడుతున్న వారు పథకం లబ్ధి అందుకుంటున్నారా?
- భూమి లేని వారు
- ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ లబ్ధి పొందుతున్న వారు
- భూమి వివరాలు సరిపోకపోవడం
- 2019 తర్వాత భూమి రిజిస్టర్ కావడం
- ఒక కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఉంటుండగా మరొక లబ్ధిదారుడికి పథకం వర్తించడం
- ఆధార్ మనుగడలో లేకపోవడం
- ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లిపోవడం
- డూప్లికేట్ రిజిస్ట్రేషన్
- భూమి సాగు చేయకుండా స్వచ్ఛందంగా వదిలేయడం
- భౌతికంగా ఉంటున్నారా? లేదా?
- 18 ఏళ్లలోపు వయసు ఉన్నవారికి ఎవరికైనా పథకం వర్తిస్తుందా?
- ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయిన తర్వాత పింఛన్‌దారుడై ఉండి పీఎం కిసాన్ పొందుతున్న వారు ఎవరైనా ఉన్నారా వంటి వివరాలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో 15,560 మంది లబ్ధిదారులను పరిశీలించనున్నారు.

పీఎం కిసాన్ లబ్ధిదారుల పరిశీలన

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల్లో 5 శాతం మంది లబ్ధిదారులను పరిశీలించాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన జాబితాలతో గ్రామ వ్యవసాయ సహాయకులు పరిశీలించి యాప్‌లో పేస్ రికగ్నైజేషన్‌తో కూడిన ఫొటో, వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు.

-ఎస్ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, సత్తెనపల్లి



జిల్లా సమాచారం

- జిల్లాలో మొత్తం లబ్ధిదారులు: 1,90,008 మంది
- 2022-23,2023-24లో పరిశీలించాల్సిన లబ్ధిదారులు: 15,560 మంది
- ఇప్పటి వరకు పరిశీలన పూర్తయ్యిన లబ్ధిదారులు: 7,975 మంది

జాతీయ లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 143 కేసులు పరిష్కారం కాగా రూ.2.84 కోట్లు కక్షిదారులకు పరిహారం కింద లభించిందని 13 అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ పేర్కొన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు మూడు బెంచీలుగా విడిపోయి అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో న్యామూర్తులు కె.మధుబాబు, టి.ప్రవల్లిక, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం

గురజాల: జాతీయ లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో ఐదు సివిల్ కేసులు పరిష్కరించి రూ.20,12,574, భరణం కింద 9 కేసులకుగాను రూ.59,75,000, క్రిమినల్ కేసులు 33 కేసులకుగాను రూ.30,000 కక్షిదారులకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీపీ బండి వీరభద్రుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, చల్లా రామిరెడ్డి, దివాకరుని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్

మాచర్లలో 54 కేసులు పరిష్కారం

మాచర్ల: మాచర్ల సివిల్ జడ్జి కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 54 కేసులు సివిల్ అడిషనల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు ఎంతో ఉపయోగకరమైంది జాతీయ లోక్ అదాలత్ అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎనిమిది సివిల్ కేసులు, 31 క్రిమినల్, రెండు భరణం కేసులతోపాటు, ప్రిలిటికేషన్, చెక్కు బౌన్స్ కేసులు మొత్తం 54 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉన్నారు.

మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేముడు

కొరిటిపాడు(గుంటూరు): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సహకారంతో చేపల రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్యలు(ఎఫ్ఎఫ్‌పీఓ)గా రూపాంతరం చేసి వ్యాపార కార్యకలాపాలను బలోపేతం చేస్తామని జిల్లా మత్స్య శాఖ అధికారి పి.గాలిదేముడు స్పష్టంచేశారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని మత్స్య శాఖ భవన్‌లో జిల్లాలోని ఏడు మత్స్య సహకార సంఘాలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎఫ్‌పీఓల వ్యాపార కార్యకలాపాలను విస్తరింపచేస్తామన్నారు. మేనేజ్‌మెంట్ కాస్ట్, ఈక్విటీ గ్రాంట్‌లు పొందేందుకు సమర్పించాల్సిన సంఘ తీర్మానాలు, సభ్యులకు సంబంధించిన షేర్లపై సంఘాలు నిర్వహించే బిజినెస్‌పై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం గుంటూరు జీజీహెచ్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శాసనసభ్యులు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణకుమార్‌లతో కలసి పర్యటించారు.

స్టాప్ డయేరియాకు జిల్లా ప్రజలు సహకరించండి

ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు

నరసరావుపేట: జిల్లాలో జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమంలో ప్రజలు అందరూ పాల్గొని ఆరోగ్య కార్యకర్తలు ఇచ్చే సూచనలు పాటిస్తూ ఏ ఒక్కరూ డయేరియా బారిన పడకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలిలతో కలిసి ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందరూ వ్యక్తిగత పరిశుభ్రత, రక్షిత నీరు, వేడి ఆహారం తీసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లలో జూలై ఒకటి నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని గృహాలను సందర్శించి అందులో ఎవరైనా డయేరియా వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తిస్తారని అన్నారు. ఆ ఇంటిలో ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నట్లయితే ఒకరికి రెండు ప్యాకెట్ల చొప్పున ఓఆర్ఎస్, 14 జింక్ టాబ్లెట్స్ అందజేస్తారని తెలిపారు. దీంతోపాటుగా ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానం, చేతులు శుభ్రం చేసుకునే విధానం ప్రదర్శన ద్వారా తెలియజేస్తారన్నారు. డయేరియా వ్యాధి సంభవించినప్పుడు శరీరంలోని నీరు, లవణాలు కోల్పోవడం ద్వారా పిల్లల్లో మరణాలు సంభవించే అవకాశం ఉన్నందున దానిని నివారించేందుకు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ ఆవశ్యకతను గురించి తెలియజేస్తారని అన్నారు. పిల్లలను ఎలాంటి పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రిని సందర్శించాలో తెలియచేస్తారని పేర్కొన్నారు.



కలెక్టరేట్‌లో స్టాఫ్ డయేరియా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు

జిల్లాలో ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీ

నరసరావుపేట: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ చెప్పారు. జూలై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. అర్హులైన అందరికి ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సేవలు వినియోగిస్తున్నామని, అదనపు సిబ్బందిగా వివిధ శాఖలలోని జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది సేవలు వినియోగిస్తున్నామన్నారు. పంపిణీకి అవసరమైన యంత్ర పరికరాలను సిబ్బందికి అందజేశామని, అదనపు సిబ్బందికి బయోమెట్రిక్ యంత్ర పరికరం వినియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. గిరిజన మండలాల్లో పెన్షన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీఎల్‌పీవో పాల్గొన్నారు.

లీజు రద్దుచేయించి నూతన బస్టాండ్ నిర్మిస్తాం

సాక్షి కథనానికి స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

- బస్టాండ్ సందర్శించి నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు
- పురపాలక సిబ్బందిచే నీరు తోడించి డ్రెయిన్ క్లీనింగ్

సాక్షి ఎఫెక్ట్..

నరసరావుపేట: ఆర్టీసీ స్థలం లీజును రద్దు చేయించి ఇప్పుడు ఉన్న బస్టాండ్‌ను పడేసి నూతనంగా నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెప్పానని అన్నారు. వర్షం కురిస్తే బస్టాండ్ బురదమయంగా మారుతుందని సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనంపై స్పందించిన ఎమ్మెల్యే చదలవాడ బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్ బురదమయంగా మారటానికి గల కారణాలను డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఎమ్మెల్యేకు వివరించారు. బస్టాండ్‌లో నుంచి వెళుతున్న డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి తాను కూడా మురుగు తొలగించారు. బస్టాండ్‌లో స్టాళ్ల నిర్వాహకులతో వారి వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. తన వద్దకు వచ్చిన యూనియన్ నాయకులతో ఆర్టీసీ సంస్థ తన స్థలాల లీజుకు ఇవ్వటాన్ని వ్యతిరేకించాలని, మీరు ఏవిధంగా ఒప్పుకున్నారని ప్రశ్నించారు. మీడియాతో మాట్లాడుతూ జిల్లా ముఖద్వారంగా ఉన్న నరసరావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఎమ్మెల్యే అయిన దగ్గర నుంచి నాలుగుసార్లు బస్టాండ్ సందర్శించానన్నారు. ఐదేళ్ల కాలంలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాన్ని వైఎస్సార్‌సీపీ వారికి లీజుకు ఇచ్చారన్నారు. దీని కారణంగా గతంలో బస్టాండ్‌లోకి బస్సులు ప్రవేశించే మార్గాన్ని మూసేశారన్నారు. దీంతోపాటు అక్రమంగా బస్టాండ్‌లో నుంచి మురుగు పారే విధంగా డ్రెయిన్ నిర్మాణం చేశారన్నారు. దీని వలన నీరు నిలబడుతుందని, అందువలన యుద్ధప్రాతిపదికన ఆ డ్రెయిన్ పూడ్చివేయించామన్నారు. నీరు బయటకు పంపించామన్నారు. లీజు రద్దు చేయాలని ఆర్టీసీ ఎండీకి చెప్పామన్నారు. బస్టాండ్‌ను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ వైపు వెళ్లే బస్సులు ఇటు వైపే వస్తుంటాయని, దీంతోపాటు జిల్లా కేంద్రంగా ఉండటం వలన బస్టాండ్‌ను బాగుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్యారేజ్‌తోపాటు అన్నీ పడేసి కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందులను మీడియా సోదరులు వెలికి తీస్తే తాను స్పందించి పరిష్కరిస్తానని అన్నారు. బస్సులు బయటకు వెళ్లే మార్గంలో నిలిచిన నీటిని పురపాలక డ్రెయిన్ క్లీన్ వాహనం ద్వారా తోడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సిలర్ కోవూరి బాబు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లోని డ్రెయిన్‌లో మురుగు తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ఎన్నికల జమా ఖర్చుల వివరాలు అందజేయండి

నరసరావుపేట: సాధారణ ఎన్నికలలో పాల్గొన్న అభ్యర్థులు జమా, ఖర్చుల వివరాలు నిబంధనల మేరకు సంబంధిత నమూనాలో అందజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు జోసెఫ్ సుమీత్‌కుమార్, గౌతమన్ సమక్షంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల్లో పాల్గొన్న అభ్యర్థులు, వారి ఏజంట్లతో ఎన్నికల జమా, ఖర్చులు రీ-కన్సిలేషన్ ప్రక్రియ చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 122 మంది ఎన్నికలలో పోటీ చేశారని, పోటీలో పాల్గొన్న వారు వారి ఎన్నికల జమా, ఖర్చులను విధిగా పూర్తిస్థాయిలో అందించి వ్యయ పరిశీలకుల సమక్షంలో పరిశీలించి వారి సంతకం, జిల్లా ఎన్నికల అధికారి సంతకం అనంతరం ఎన్నికల కమిషన్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఎన్నికల జమా, ఖర్చుల వివరాలు అందించని వారి పేర్లు బ్లాక్‌లిస్టులో ఉంచి రానున్న రెండు ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హత పొందుతారని అన్నారు. గెలిచిన అభ్యర్థి విధిగా త్వరితగతిన వివరాలు అందించాలన్నారు. సమావేశంలో అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌లో అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్

వీవీ ప్యాడ్స్ పరిశీలన

జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ శనివారం మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేశారు. వీవీ ప్యాడ్లలో ఉండే పేపర్ రోల్, అడ్రస్ సీల్‌ను తొలగించే ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఆర్డీవో పి.సరోజని, సత్తెనపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమిటీ వేసి విచారణ జరిపిస్తాం

- బాపట్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్
- సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్గంధంపై ప్రజాభిప్రాయ సేకరణ

మేదరమెట్ల: సింథైట్ కారం ఫ్యాక్టరీ నుంచి వెలువడే కోరు, దుర్గంధం నియంత్రణపై కమిటీ వేసి విచారణ చేపడతామని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ తెలిపారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం తమ్మవరం రోడ్డు సమీపంలో ఉన్న సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్గంధంపై ప్రజాభిప్రాయసేకరణ, ఫిర్యాదుల కార్యక్రమాన్ని కొరిశపాడు మండల కార్యాలయంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఫ్యాక్టరీ నుంచి ప్రమాదకరమైన దుర్గంధాలు తరచూ వస్తున్నాయని, దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఫ్యాక్టరీని తక్షణమే మూసి వేయాలని కోరారు. మిరపకాయల తొడిమలను ఫ్యాక్టరీలో వినియోగించడం ద్వారా కోరు విపరీతంగా వస్తోందని, అది వెలువడే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గతంలో 60 టన్నులు ఉత్పత్తి జరిగేదని, ప్రస్తుతం 100 టన్నులకు పెంచారన్నారు. దీంతో 40 టన్నుల మిరప పిప్పి, కోరు బయటకు వస్తోందని చెన్నై ఐఐటీ బృందం గుర్తించిందని గ్రామస్తులు తెలిపారు.



సింథైట్ ఫ్యాక్టరీపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

చెరువు నీరు కలుషితం

వ్యర్థాల్ని బయటకు వదలడం వల్ల సమీపంలోని పొలాలు, చెరువులు కలుషితమవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చెరువుల్లో నీళ్లు తాగిన పశువులు మృత్యువాత పడ్డాయని వాపోయారు. అన్ని అనుమతులతోనే తాము ఫ్యాక్టరీ నడుపుతున్నామని ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. దీనిపై కమిటీని ఏర్పాటు చేసి గ్రామస్తుల సమక్షంలో పొల్యూషన్ బోర్డు అధికారులు విచారణ జరిపించేలా చూస్తామని తెలిపారు. సాంకేతిక నిపుణుల పరిశీలనతో వాస్తవాలను తెలుసుకుంటామని, ఫ్యాక్టరీ పనిచేసే సమయంలోనే సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. విచారణ నివేదికను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, ప్రభుత్వానికి అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి. సూర్యనారాయణరెడ్డి తహసీల్దార్ సుశీల, గ్రామస్తులు, ఫ్యాక్టరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము

మేదరమెట్ల: జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును సచివాలయాల ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి అందజేస్తారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సమతవాణి మాట్లాడుతూ మండలంలో మొత్తం 7,425 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరందరికీ సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సొమ్మును అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పింఛనుదారులు ఇంటి దగ్గరే ఉండాలని, ఎవరూ బ్యాంకుల వద్దకు గానీ సచివాలయాల వద్దకు గానీ వెళ్లవద్దని ఆమె సూచించారు.

క్లుప్తంగా

ఎయిమ్స్‌లో సీటు సాధించిన తుమ్మలచెరువు వాసి



పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన అల్లు రాజశేఖర్‌రెడ్డి మంగళగిరి ఎయిమ్స్‌లో న్యూరాలజీ విభాగంలో సీటు సాధించాడు. ఏప్రిల్‌లో జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఎంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ అడ్మిషన్, ఐఎన్ఐ ఎస్ఎస్‌లో ఆలిండియా స్థాయిలో 12వ ర్యాంక్, ఏఎంఐలో 17 ర్యాంక్ సాధించిన రాజశేఖరరెడ్డి మంగళగిరి ఎయిమ్స్‌లో సీటు సాధించాడు. వైజాగ్ ఆంధ్రా మెడికల్‌లో ఎంబీబీఎస్, కర్నాటక మణిపాల్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు.

దోపిడీ కేసుల్లో నిందితుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: పలు దోపిడీలు, దొంగతనాల్లోని ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సర్కిల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 23వ తేదీన మండలంలోని లింగంగుంట్ల గ్రామ పరిధిలో కమ్మవారిపాలెం గ్రామానికి వెళ్లే తాగునీటి చెరువు వద్దకు పట్టణానికి చెందిన గట్టా జయసాయి పవన్‌రోహిత్, అతని మిత్రుడు సలీం వాకింగ్ నిమిత్తం వెళ్లారు. ఆయా కేసుల్లో నిందితులైన చిలకలూరిపేట సాంబశివనగర్‌కు చెందిన జూపూడి రాజేష్ అలియాస్ అశోక్, మదర్‌థెరిసా కాలనీకి చెందిన షేక్ అబ్దుల్‌బాషా, పాలడుగు నాగేశ్వరరావు అక్కడ మద్యం సేవిస్తున్నారు. ముగ్గురు యువకులు వీరిపై కర్రలు, ప్లాస్టిక్ పైపుతో దాడి చేసి వారి నుంచి సెల్‌ఫోన్లు లాక్కొని పరారయ్యారు. దీంతో కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు సీఐ పి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక సహాయంతో వీరిని చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.20వేల విలువైన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెడు వ్యసనాలకు బానిసై ఏపీలోని చిలకలూరిపేట రూరల్, అర్బన్, నాదెండ్ల, బల్లికురవ, తెలంగాణ రాష్ట్రం వాడపల్లి పరిధిలో పలు దోపిడీలు, దొంగతనాలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను త్వరిగతిన పట్టుకున్న రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ, ఏఎస్ఐ డి.రోశిబాబు, హెడ్ కానిస్టేబుల్ శేషిరెడ్డి, కానిస్టేబుల్ ఇర్మియలను జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్ అభినందించారు.

అసంఘటిత కార్మిక చట్టాలు, పథకాలపై అవగాహన

గుంటూరురూరల్: అసంఘటిత కార్మిక చట్టాలు, ప్రభుత్వ పథకాలపై ఇండియన్ లేబర్ లైన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని పెదపలకలూరు గ్రామంలో శనివారం కార్మికులకు ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల కార్డు, ఈ–శ్రమ కార్డులు అందజేస్తున్నాయన్నారు. వాటి ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్మిక కార్డులు పొందేందుకు 18 సంవత్సరాలు దాటి 60 సంవత్సరాలలోపు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ అర్హులేనని తెలిపారు. ఇండియా లేబర్ లైన్ ప్రతినిధి మాట్లాడుతూ ఇండియా లేబర్ లైన్ సంస్థ అసంఘటిత కార్మికులకోసం ఉచితంగా న్యాయ సలహాలను అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18008339020 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అలరించిన సంగీత మహోత్సవం

ఇద్దరు సంగీత విద్వాంసులకు 'గాన విదుషి' రామకుమారి స్మారక అవార్డుల ప్రదానం



బీవీ దుర్గాభవాని, పాటిబండ్ల జానకికి అవార్డు ప్రదానం చేస్తున్న అన్నవరపు రామస్వామి, ఎం.శేషురాణి

తెనాలి: ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు 'గాన విదుషి' గద్దె వేంకట రామకుమారి నవమ వర్ధంతి సంగీత మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. పట్టణానికి చెందిన సంగీత సంస్థ హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఏర్పాటైన సభకు గుంటూరులోని గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం.శేషురాణి అధ్యక్షత వహించారు. సభలో రామకుమారి ప్రియశిష్యులు ప్రముఖ సంగీత విద్వాంసురాలు, విశ్రాంత సంగీత ఉపాధ్యాయిని పాటిబండ్ల జానకి, 'సంగీత విద్వన్మణి' బీవీ దుర్గాభవానికి రామకుమారి స్మారక అవార్డును ప్రదానం చేశారు. రామకుమారి శిష్యరికంలో సంగీత సాధనతో తన జీవితం ధన్యమైందని పాటిబండ్ల జానకి చెప్పారు. తన గురువులు రామకుమారి, 'నాద సుధార్ణవ' అన్నవరపు రామస్వామి శిష్యరికంలో తన సంగీత సాధనలోని అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మరొక సత్కార గ్రహీత బీవీ దుర్గాభవాని మాట్లాడుతూ తన సంగీత విద్య, తనకు లభించిన కీర్తిప్రతిష్టలు గురువులు రామకుమారి, అన్నవరపు రామస్వామి పెట్టిన భిక్షగా చెప్పుకొన్నారు. గురువుల ఆదర్శంగా సంగీత ప్రచారంలో కొనసాగుతున్నానని చెప్పారు. ముందుగా అన్నవరపు రామస్వామి తన ప్రసంగంలో ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన సంగీత గురువు రామకుమారి ప్రత్యేకతలను వివరించారు. తొలుత ప్రముఖ వీణ విద్వాంసురాలు పుచ్చా కనకదుర్గ వీణావాదనతో సంగీతోత్సవం ఆరంభమైంది. సభానంతరం బీవీ దుర్గాభవాని గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. వీరికి వయొలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై కేవీ రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. నిర్వాహక అకాడమీ అధ్యక్షుడు కోదండ రామశాస్త్రి, సుబ్రహ్మణ్యశాస్త్రి, రవికుమార్ పాల్గొన్నారు. అకాడమీ కార్యదర్శి వీఎల్ సుజాత పర్యవేక్షించారు.

శ్రీకాకుళం జట్టు ఘన విజయం

- రెండో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైన పశ్చిమ గోదావరి
- ఇన్నింగ్స్ 143 పరుగుల విజయంతో శ్రీకాకుళం జట్టుకు 7 పాయింట్లు



పి.రుత్విక్ సాగర్, 6 వికెట్లు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలో పేలవమైన ఆటతీరుతో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు రెండో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జిల్లా జట్ల మధ్య ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఇన్నింగ్స్ 143 పరుగుల తేడాతో విజయం సాధించింది. శ్రీకాకుళం జట్టు ఆరు వికెట్ల నష్టానికి 212 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో శనివారం ఆట ప్రారంభించి 309 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని బి.భానుప్రకాష్ నాయుడు 73, వి.క్రాంతికుమార్ 56, సిహెచ్.రోహిత్ 41 పరుగులు సాధించారు. పశ్చిమగోదావరి జట్టు బౌలర్ కె.శ్రీరఘురామ్‌నాయుడు 10 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు 109 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జె.సాయిరామ్‌చరణ్‌రాజ్ 34 పరుగులు సాధించాడు. శ్రీకాకుళం బౌలర్ పి.రుత్విక్‌సాగర్ 9 ఓవర్లకు 29 పరుగులు ఇచ్చి 6 వికెట్లు సాధించాడు. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టుకు 7 పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

సీపెట్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి: భారత ప్రభుత్వ విద్యాసంస్థ విజయవాడ సీపెట్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని సీపెట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా మూడు సంవత్సరాల కాల వ్యవధితో కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థినీ విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ వసతి కలదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు 'ఫీజు రీయింబర్స్‌మెంట్' సదుపాయం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జులై 7వ తేదీ దరఖాస్తు చేసుకోవాలన్నారు ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థలు వాటి అనుబంధ సంస్థలలో, ఇంజినీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్–మేకర్, ఇంజినీర్ (మైంటెనెన్స్) వంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. డిప్లమా పూర్తిచేసిన వారికి ప్రారంభ వేతన స్థాయి నెలకు రూ.16,000 నుంచి రూ.20,000 వరకు ఉంటుందన్నారు. ఈ కోర్సు చేయటం ద్వారా సాధారణ విద్యార్థులు కూడా మెరుగైన విజయాన్ని సాధించవచ్చన్నారు. దరఖాస్తు విధానం, ఇతర వివరాల కోసం 9398050255 నంబరులో సంప్రదించాలన్నారు.

పొలంలోని టేకు చెట్లు మాయం



ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

ముప్పాళ్ల: పొలం గట్లపై పెంచుకుంటున్న టేకు చెట్లను నరికి మాయం చేసిన సంఘటన ముప్పాళ్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చవాకుల వెంకటనాగ కోటేశ్వరరావు 25 సంవత్సరాల కిందట తన పొలం గట్ల మీద టేకు చెట్లు నాటి పెంచుకుంటున్నాడు. వీటిపైన కళ్లు పడిన దుండగులు రెండు రోజులపాటు రెక్కీ నిర్వహించారు. బలంగా ఉన్న పెద్ద చెట్లకు మార్కింగ్ వేసుకున్నారు. ఈనెల 26వ తేదీ రాత్రి సమయంలో చిరుజల్లులు పడుతుండటంతో వారి ప్లాన్‌ను అమలు జరిపారు. పది పెద్ద చెట్లను నరికి ముక్కలు చేసి ట్రాక్టర్‌ల ద్వారా రాత్రికి రాత్రే నరసరావుపేటలోని కోత మిషన్‌కు తరలించారు. రెండు రోజుల తర్వాత సమాచారం తెలుసుకున్న పొలం యజమాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణ లో నరసరావుపేటలోని ఓ కోత మిషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. దుంగలను రెండు మినీ లారీల ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. వెంకటనాగకోటేశ్వరరావు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ.హజరతయ్య తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



మంగళగిరి: మహిళల మెడల్లో వరుసగా బంగారు గొలుసులు లాక్కెళ్తున్న చైన్‌స్నాచర్‌ను అరెస్ట్ చేసిన అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు గుంటూరు జిల్లా అడిషనల్ ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వ్యసనాలకు, జల్సాలకు అలవాటుపడిన విజయవాడకు చెందిన విఘ్నేష్ ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడల్లోని బంగారు చైన్‌లను లాక్కెళ్తుంటాడన్నారు. ఇటీవల మంగళగిరి, గుంటూరులలో ఇద్దరు మహిళల వద్ద చైన్‌లు తస్కరించగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడు శుక్రవారం నగర పరిధిలోని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద ఉన్నాడనే పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. డీఎస్పీ రవికాంత్, సీసీఎస్ సీఐ వెంకన్న చౌదరి, పట్టణ సీఐ వినోద్‌కుమార్, ఎస్ఐలు ఖాదర్ బాషా, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

దిగువ కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దిగువ కృష్ణానదిపై ఉన్న కొత్త బ్రిడ్జి 4వ పిల్లర్ వద్ద నీటి గుంతలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య శనివారం తెలిపారు. సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడి రెండు కాళ్లు విరిగిపోయి ఉన్నాయన్నారు. మృతుడి ఒంటిపై ముదురు ఆకుపచ్చ చారలు ఉన్న లేత ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలి రంగు, కాఫీ రంగు ఉన్న గళ్ల లుంగీ, కాఫి రంగు కలిగి యువరాజ్ కంపెనీకి చెందిన ఫుల్ డ్రాయర్ ధరించబడి ఉన్నాయన్నారు. మెడకు తెల్లని కట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు నాగార్జునసాగర్ ఎస్ఐ 9440900884, పోలీస్‌స్టేషన్ 08642-278219, మాచర్ల రూరల్ సీఐ 9440796229 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

చిలకలూరిపేటటౌన్: రెండో వివాహం చేసుకున్న భార్య తన మొదటి భర్తతో సన్నిహితంగా ఉంటుందన్న అనుమానంతో హత్య చేసిన కేసులో భర్తను చిలకలూరిపేట రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం జరిగిన ఈ హత్య కేసు వివరాలను రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి.రవికృష్ణ, వి.బాలకృష్ణ వెల్లడించారు. పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న మేడా సాయి భవానీకి ఐదేళ్ల కిందట పృథ్వీతో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగా ఏడాది కిందట విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. అనంతరం ఆమె సురేష్‌ను వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో సాయి భవానీ తన మొదటి భర్తతో తరచూ మాట్లాడుతూ, రహస్యంగా కలుస్తుందని భర్త సురేష్‌కు అనుమానం వచ్చింది. ఇందుకు భవానీ అక్క సహకారం అందిస్తున్నట్లు గ్రహించి భార్యను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఆవేశంలో ఉన్న సురేష్ బైక్‌ను తెచ్చి మాట్లాడాలంటూ భార్య భవానీని ఎక్కించుకుని పోతవరం పొలాల్లోకి తీసుకెళ్లాడు. తర్వాత భవానీ శవమై కనిపించింది. భర్త సురేష్ గొంతునులిమి హత్య చేశాడంటూ ఆమె అక్క ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ ఎస్ఐ వి బాలకృష్ణ కేసు నమోదు చేశారు. డీఎస్పీ లక్ష్మీపతి నేతృత్వంలో రూరల్ పోలీసులు హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు జి రవికృష్ణ, వి బాలకృష్ణ, కానిస్టేబుల్స్ పి శ్రీకాంత్, ఎం ఇర్మియలను అభినందించారు.

నూరుశాతం గ్రాస్ శాలరీ ఇప్పించరూ..

కేంద్ర సహాయమంత్రికి కాంట్రాక్టు నర్సుల సంఘం వినతి

గుంటూరు మెడికల్: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు జీఓలతో సంబంధం లేకుండా నూరుశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కాంట్రాక్టు నర్సుల సంఘం నేతలు కోరారు. ఈమేరకు శనివారం గుంటూరు జీజీహెచ్‌కు విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు నర్సింగ్ అధికారులను రెగ్యులర్ చేయాలని, మేనిఫెస్టోలో పేర్కొన్నవిధంగా కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ నర్సుల సంఘం నేతలు మనీషా, దివ్య ఉన్నారు.

కుంకుమ బండ్లతో గ్రామోత్సవం

కొనసాగుతున్న ముత్యాలమ్మ జాతర



ఆలయం వద్దకు వెళ్తున్న కుంకుమ బండ్లు

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రవెల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా శనివారం కుంకుమ బండ్లతో గ్రామ పురవీధులలో గ్రామోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఇంద్రవెల్లి అమ్మవారికి పూర్వకాలం నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి ముత్యాలమ్మ జాతర కులమతాలకతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కులు చెల్లించుకుంటారు. లక్షల వ్యయంతో 33 కుంకుమ బండ్లు కట్టి వాటిని అందంగా అలంకరించారు. ఆచారంలో భాగంగా ముందు పెద్దకాపు, కరణం, పెద్దశెట్టి కుంకుమ బండ్లు, తరువాత వివిధ సమాజిక వర్గాలకు చెందిన మరో 30 బండ్లు గ్రామోత్సవంలో పాల్గొన్నాయి. పోతురాజు, మాతంగి కుంకుమ బండ్లకు ముందుండి దేవుని బజార్లలో తిరిగి అనంతరం ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి కుంకుమ బండ్లతో గ్రామోత్సవం ప్రారంభించి రాత్రి 9 గంటల వరకు జాతర చేస్తూ ఆలయం వద్ద వరకు ఊరేగింపు కొనసాగించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్ఐ ఎం.అంజనేయులు తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

చిగుళ్ల వ్యాధిపై అవగాహన అవసరం

- ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్
- సిబార్ డెంటల్ కాలేజీలో చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్, డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్

పెదకాకాని: చిగుళ్ల వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియాడెంటాలజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఆశిష్ జైన్ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం చిగుళ్ల వ్యాధిపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఆశిష్ జైన్ మాట్లాడుతూ దంత వైద్యుల పర్యవేక్షణలో చిగుళ్ల వ్యాధులపై నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. నోటి శుభ్రతతోనే చిగుళ్ల వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ నోటి శుభ్రత పాటించాలన్నారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ హెచ్.ఎస్.గ్రోవర్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో చిగుళ్ల వ్యాధులపై అనేక సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుల నిర్వహణ వల్ల దంత వైద్యులకు, విద్యార్థులకు అవగాహన కలగటమే కాకుండా ప్రజల్లో కూడా చైతన్యం వస్తుందని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటువంటి సదస్సులు గతంలో ఎన్నో నిర్వహించామని, భవిష్యత్తులో కూడా మరిన్ని చేపడతామన్నారు.